15నుంచి కార్టూన్ల ప్రదర్శన

బెంగళూరు, నవంబరు 9 (ఆంధ్రజ్యోతి): ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ కార్టూనిస్ట్స్ ఆధ్వర్యంలో 'పాకెట్' పేరిట ఈనె 15 నుంచి కార్టూన్ల ప్రదర్శన నిర్వహిస్తోంది. నగరంలోని ఇండియన్ కార్టూన్ గ్యాలరీలో ఎగ్జిబిషన్ జరగనుంది. కస్తూరి సంస్థల చైర్మన్ కే వేణుగోపాల్ ప్రారంభించనున్నారు. ప్రత్యేకించి రవికాంత్ గీసిన చిత్రాలు ఇందులో ప్రదర్శిస్తామని నిర్వాహకులు తెలిపారు. ఆదివారం మినహా ప్రదర్శన ప్రతి రోజూ ఉదయం 10 గంటల నుంచి సాయంత్రం 6వరకు ఉంటుంది.



ఉపరాష్ట్రపతి రాధాకృష్ణన్‌ను ఆశీర్వదిస్తున్న అర్చకులు

మేలుకోటెలో ఉపరాష్ట్రపతి

● చలువరాయస్వామికి ప్రత్యేక పూజలు నిర్వహించిన రాధాకృష్ణన్

బెంగళూరు, నవంబరు 9(ఆంధ్రజ్యోతి): మండ్య జిల్లా మేలుకోటెలోని చలువరాయస్వామి ఆలయంలో ఉపరాష్ట్రపతి సీపీ రాధాకృష్ణన్ ప్రత్యేకపూజలు జరిపారు. ఉపరాష్ట్రపతి ఒకరోజు పర్యటన నిమిత్తం రాష్ట్రానికి ఆదివారం చేరుకున్నారు. ప్రత్యేక విమానంలో ఆయన యలహంక విమానాశ్రయానికి చేరకున్నారు. గవర్నర్ థావర్‌చంద్ గెహ్లోట్, కేంద్ర మంత్రి కుమారస్వామి, రాష్ట్రమంత్రి భైరతి సురేశ్, చీఫ్ సెక్రటరీ శాలిని రజనీశ్ ఆయనకు సాదరంగా స్వాగతం పలికారు. అక్కడనుంచి నేరుగా ప్రత్యేక హెలికాప్టర్‌లో హాసన్ జిల్లా శ్రావణబెళగొళకు చేరుకున్నారు. గుమ్మటనగర బాహుబలి సాంకేతిక విశ్వవిద్యాలయం ప్రాంగణంలో 20వ శతాబ్దం ప్రథమాచార్య



చారిత్ర చక్రవర్తి ఆచార్య శ్రీ 108 శాంతిసాగర మహారాజ జీ విగ్రహాన్ని ఉపరాష్ట్రపతి ఆవిష్కరించారు. చారుకీర్తి పండితాచార్యవర్యభట్టారక భట్టాచార్య మహాస్వామీజీ తదితరులు పాల్గొన్నారు. జైన దిగంబర గురువులు నిర్వహించిన కార్యక్రమంలో పాల్గొన్నారు. కేంద్రమంత్రి కుమారస్వామి, హాసన్ జిల్లా ఇన్‌చార్జ్ మంత్రి కృష్ణబైరేగౌడ, మంత్రి సుధాకర్‌తో తదితరులు పాల్గొన్నారు. అనంతరం మండ్య జిల్లా పాండవపుర తాలూకా మేలుకోటె ఆలయాన్ని సందర్శించారు. ఉపరాష్ట్రపతికి పండితులు వేదమంత్రాలతో పూర్ణకుంభస్వాగతం పలికారు. ఆలయంలో ప్రత్యేక పూజలలో పాల్గొన్నారు. తీర్థప్రసాదాలు స్వీకరించారు. గవర్నర్ థావర్‌చంద్ గెహ్లోట్, జిల్లా ఇన్‌చార్జ్ మంత్రి చలువరాయస్వామి, ఎమ్మెల్యేలు తదితరులు ఆయన వెంట ఉన్నారు. అక్కడ నుంచి నేరుగా మైసూరులోని సుత్తూరు మఠాన్ని సందర్శించారు. మైసూరు నుంచి ప్రత్యేక విమానంలో ఢిల్లీకి బయల్దేరారు. ఉపరాష్ట్రపతికి గవర్నర్, కేంద్రమంత్రి కుమారస్వామి, మంత్రి భైరతి సురేశ్, మాజీ మంత్రి పుట్టరాజు సాదరంగా వీడ్కోలు పలికారు.



ఆలయంలో ప్రదక్షిణ చేస్తున్న ఉపరాష్ట్రపతి

గంటన్నరపాటు

గాల్లోనే..!

● ఆకాశంలో విమానం చక్కర్లు
● భయాందోళనల్లో స్థానికులు
● పరీక్ష కోసమేనన్న అధికారులు



ఆకాశంలో చక్కర్లు కొడుతున్న విమానం

బెంగళూరు, నవంబరు 9(ఆంధ్రజ్యోతి): ఓ విమానం ఈనెల 8న గంటన్నరపాటు బెంగళూరు నగర పరిధిలో చక్కర్లు కొట్టింది. ఎయిరిండియా సంస్థకు చెందిన ఏఎక్స్‌బీ 558 బీ738 విమానం పదే పదే రౌండ్లు వేసింది. జేపీ నగర్ థర్డ్‌ఫేజ్‌లోని ఓ కంపెనీ ఉద్యోగులు ఫొటోలు, వీడియోలు తీసి సోషల్ మీడియాలో పోస్ట్ చేశారు. విమానం చక్కర్లతో నగర ప్రజలు భయాందోళనలకు లోనయ్యారు. విమానం చక్కర్లు కొట్టిన విషయమై ఎయిరిండియా సంస్థ ఆదివారం ప్రకటనలో వివరణ ఇచ్చింది. విమానంలో ప్రయాణికులు ఎవరూ లేరనీ, సిబ్బంది మాత్రమే ఫేరీ రైడ్ చేసినట్లు ప్రకటించింది. విమాన పర్యవేక్షణ, పరిశీలన, ట్రయల్ తరహాలో ఫేరీ రైడ్ నిర్వహించినట్లు వివరించింది. ఫేరీ రైడ్ కోసం ఎయిరిండియా విమానం హెచ్ఏఎల్ విమానాశ్రయానికి వచ్చింది. సాంకేతిక పరిశీలనలో భాగంగా బెంగళూరు పరిధిలో గంటన్నరపాటు చక్కర్లు కొట్టింది. ఇది సామర్థ్య పరిశీలన కోసం చేసిన రైడ్‌గా పేర్కొన్నారు.

ఐరన్‌మ్యాన్ పోటీల్లో

ఎంపీ తేజస్వి సూర్య

బెంగళూరు, నవంబరు 9(ఆంధ్రజ్యోతి): గోవాలో ఆదివారం జరిగిన ఐరన్‌మ్యాన్ పోటీల్లో బీజేపీ ఎంపీ తేజస్వి సూర్య విజయవంతంగా పాల్గొన్నారు. తమిళనాడు బీజేపీ మాజీ అధ్యక్షులు అణ్ణామలై కూడా ఇందులో పాల్గొన్నారు. 1.9 కిలోమీటర్ల ఈత, 90 కిలోమీటర్ల సైక్లింగ్, 21.1 కిలోమీటర్ల జాగింగ్‌ను 7.49 గంటల్లో పూర్తి చేశారు. స్విమ్మింగ్‌కు 44 నిమిషాలు, సైక్లింగ్‌కు 3.47గంటలు, జాగింగ్‌కు 2.54 గంటలు తీసుకున్నారు. అణ్ణామలై 8.13 గంటల్లో పూర్తి చేశారు. అనంతరం తేజస్విసూర్య వ రాట్లా డ ం త రా 50కుపైగా దేశాల క్రీడాకారులను ఆకర్షించే ఐరన్‌మ్యాన్ 70.3 గోవా ఓ ప్రముఖమైన పోటీ అన్నారు. ఫిట్ ఇండియా ఉద్యమంలో భాగంగా ఎంతోమంది పాల్గొన్నారని, ఇందులో తానూ పాల్గొనడం ఆనందంగా ఉందన్నారు.



ఐరన్‌మ్యాన్ పోటీల్లో రాణించిన తేజస్విసూర్య, అణ్ణామలై

కరువు నేలలో సిరులు పండిస్తాం

● సీఎం సిద్దరామయ్య ● కూడ్లిగిలో రూ.870 కోట్లతో 74 చెరువులు నింపే కార్యక్రమానికి శ్రీకారం

బళ్లారి, నవంబరు 9(ఆంధ్రజ్యోతి): కరువు ప్రాంతమైన కూడ్లిగి నియోజకవర్గంలో 74 చెరువులను భద్ర జలాలతో జలాలు నింపి కరువు సీమలో రైతులు సిరులు పండించేలా జలాలు అందిస్తామని ముఖ్యమంత్రి సిద్దరామయ్య అన్నారు. ఆదివారం కూడ్లిగిలో రూ. 870 కోట్లతో 74 చెరువులకు నీరు నింపే కార్యక్రమానికి ఆదివారం ఆయన శ్రీకారం చుట్టారు. సమావేశానికి కూడ్లిగి ఎమ్మెల్యే డాక్టర్ శ్రీనివాసులు అధ్యక్షత వహించారు. ముందుగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ఈ ప్రాంతంలో పుట్టిన తనకు ఇక్కడి ప్రజల బాధలు తెలుసన్నారు. అందుకే ప్రభుత్వంలో అందరి సహకారంతో కూడ్లిగి తాలూకాలో 74 చెరువులను తుంభద్ర జలాలతో నింపే కార్యక్రమం చేపట్టామన్నారు. అనంతరం సీఎం మాట్లాడుతూ ఇక్కడ చెరువుల్లో నీరు నింపడంతో అదనంగా లక్షల ఎకరాల్లో పంట సాగు అవుతాయన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల సందర్భంగా ప్రజలకు ఇచ్చిన ప్రతి హామీని అమలు చేస్తోందన్నారు. బీజేపీ నాయకులు కాంగ్రెస్ పార్టీ చేస్తున్న అభివృద్ధి చూసి తట్టుకోలేకే అబద్ధాల ఆరోపణలు చేస్తున్నారన్నారు. కేంద్ర ప్రభుత్వం అన్ని రాష్ట్రాల్లో దొంగ ఓట్లుతోనే అధికారంలోకి వచ్చిందన్నారు. నైతిక విలువలు ఉంటే వెంటనే కేంద్రంలో బీజేపీ వెంటనే రాజీనామా చేయాలన్నారు. చెరుకు కొనుగోళ్ల విషయంలో బీజేపీ రైతులతో రాజకీయం ఆడుతుందన్నారు. రాష్ట్రంలో మళ్లీ వచ్చేది కాంగ్రెస్ ప్రభుత్వమేనని, తాను ఇంకా రెండున్నరేళ్లు పదవిలో ఉంటానన్నారు. ఆయనతో పాటు మంత్రి జమీర్ అమ్మద్, సంతోష్‌లాడ్, సతీష్‌జార్కిహోళీ. బోసరాజు, ఎమ్మెల్యేలు మాట్లాడారు. అనంతరం ప్రభుత్వ పథకాలను లబ్దిదారులకు సీఎం అందజేశారు. ఇళ్లులేని మహిళకు ఇంటి పట్టాను సీఎం, డీసీఎం చేతుల మీదుగా అందించారు.



లబ్ధిదారులకు ఇంటి పట్టాను అందిస్తున్న ముఖ్యమంత్రి సిద్దరామయ్య

హారోబెలె డ్యాంలో

ఏనుగుల కళేబరాలు

● పరిశీలించిన అటవీశాఖ అధికారులు
● నది దాటే వేళ ప్రమాదం జరిగినట్లుగా గుర్తింపు

బెంగళూరు, నవంబరు 9(ఆంధ్రజ్యోతి): కనకపుర తాలూకా సాతనూరు అటవీప్రాంతంలోని హారోబెలె డ్యాం బ్యాక్‌వాటర్‌లో రెండు ఏనుగులు మృత్యువాత చెందాయి. కున్నూరిలో అర్కావతి నదికి హారోబెలె డ్యాం నిర్మించారు. డ్యాం నీటిలో ఏనుగుల కళేబరాలు కొట్టుకువచ్చాయి. ఆదివారం స్థానికులు గమనించి వెంటనే అటవీశాఖ అధికారులకు సమాచారం ఇచ్చారు. వెంటనే అటవీశాఖ అధికారులు అక్కడికి చేరుకున్నారు. డ్యాం బ్యాక్‌వాటర్‌ను దాటేవేళ చిక్కుకుని ప్రాణాలు కోల్పోయినట్లు ప్రాథమికంగా గుర్తించారు. ఏనుగుల మృతికి ఖచ్చితమైన కారణం పోస్టుమార్టం నివేదిక అనంతరం తేలనుందన్నారు. ఏనుగుల మృతి నేపథ్యంలో డ్యాం సందర్శనకు పర్యాటకులను అనుమతించడం లేదు.



హారోబెలె డ్యాం



మత్తెక్కిస్తున్న హైడ్రోగంజాయి

● ఐదు నెలల్లో 150 కిలోలకుపైగా పట్టివేత ● ఆన్‌లైన్‌లోనే అమ్మకాలు ● కిలో రూ.కోటికి పైనే.. ● పోలీసులకు దొరకకుండా ఏసీ గదులు, గ్రీన్‌హౌస్‌ల్లో సాగు

బెంగళూరు, నవంబరు9(ఆంధ్రజ్యోతి): మత్తుకోసం ఒకప్పుడు గంజాయి మాత్రమే తీసుకునేవారు. అదికూడా ఎవరో బానిసలైనవారు మాత్రమే ఉపయోగించేవారు. రానురాను డ్రగ్స్‌లో పలు రకాలు వచ్చేశాయి. ఇంజెక్షన్‌ల రూపంలోనే కాకుండా పౌడర్, మాత్రల తరహాలోనే డ్రగ్స్ విక్రయాలు సాగుతున్నాయి. తాజాగా డ్రగ్స్‌తో మిశ్రమమైన చాక్ అందుబాటులోకి వచ్చేశాయి. గంజాయి మాత్రమే రహస్యంగా లేదా అటవీప్రాంతాల్లో సాగు చేస్తారు. అది కూడా వివిధ రాష్ట్రాలనుంచి కర్ణాటకకు దిగుమతి అవుతుంటుంది. వాటిపై నియంత్రణకు పోలీసులు ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేశారు. విదేశాలనుంచి కొరియర్, పోస్ట్ ద్వారా వస్తే కనిపెట్టేస్తున్నారు. ఇలా బెంగళూరులోని చామరాజపేట పోస్టాఫీస్‌లోనే పలుమార్లు విదేశీ పార్సిల్స్‌ను గుర్తించారు. విదేశీయులు పట్టుబడిన సందర్భం కూడా ఉంది. ఇదంతా ఒకప్పటి తంతు. పోలీసులకు అనుమానం రాకుండా హైడ్రోగంజాయి రాష్ట్రంలో సాగు చేయడం కలకలం రేపుతోంది.

మట్టిలో పెరిగే చెట్లయితే ఎక్కడైనా గుర్తిస్తారని కొత్తగా హైడ్రోగంజాయి పెంపకానికి సిద్ధమవుతున్నారు. మట్టి అవసరం లేకుండానే ఏసీ గదులు, గ్రీన్ హౌస్‌ల్లో ఇవి సాగు చేస్తారు. హైడ్రోగంజాయి స్మగ్లింగ్‌ను నియంత్రించడం పోలీసులకు సవాల్‌గా మారుతోంది. పంట పొలాల్లో సాగు చేస్తే ఇరుగు పొరుగు ఉండే రైతులు, ఇతరత్రా అనుమానం వస్తూనే క్షణాల్లో పోలీసులకు సమాచారం చేరుతుంది. దీంతో ఏసీ రూంలలో గంజాయి సాగు చేసే విధానం పెరుగుతున్నట్టు తెలుస్తోంది. అత్యంత వేగవంతంగా సంప్రదాయమైన పంటల తరహాలోనే సాగుచేసేందుకు వీలుంది. సింథటిక్ డ్రగ్స్‌కంటే ఎక్కువ డోసు కలిగి ఉండడంతో యువత హైడ్రోగంజాయి పైనే ఆసక్తి చూపుతున్నట్టు తెలుస్తోంది. ఇతర డ్రగ్స్‌ల తరహాలో ఎటువంటి వాసన ఉండడం లేదు. సేవించినవారిని గుర్తు పట్టడం కూడా సాధ్యం కాని పరిస్థితి. ఇలాంటి అనుకూలం ఉండడంతో దందాకోరులకు రవాణా సులభతరం అవుతోంది.

రాష్ట్రంలోనే అధికం

దేశవ్యాప్తంగా 2025 జనవరి నుంచి మే వరకు 2027 కేసులు నమోదు చేసి 139మందిని అరెస్టు చేశారు. వారినుంచి 844 కేజీల గంజాయిని స్వాధీనం చేసుకున్నారు. ఇతర రాష్ట్రాలతో పోలిస్తే కర్ణాటకలోనే అత్యధికంగా పట్టుబడింది. మహారాష్ట్ర రెండోస్థానంలో ఉంది. కేజీ హైడ్రోహైడ్రోగంజాయి మార్కెట్‌లో కోటి రూపాయల విలువ చేస్తుంది. కొరియర్, పార్సిల్ బుక్ ద్వారా రవాణా చేస్తున్నారు. థాయ్‌ల్యాండ్‌తోపాటు పలు దేశాలనుంచి స్మగ్లింగ్ చేస్తున్నారు. వెబ్‌సైట్‌ల ద్వారా హైడ్రోగంజాయి కోసం ప్రకటనలు వెల్లడిస్తున్నారు. డార్క్‌వెబ్‌లో ధైర్యంగా గంజాయి విక్రయాలు సాగిస్తున్నారు. వాటిపై పోలీసులు నిఘా పెంచుతున్నారు. హైడ్రోగంజాయి నియంత్రణకై కేంద్ర, రాష్ట్రాల మధ్య సమన్వయం కోసం నార్కో కోఆర్డినేషన్ సెంటర్‌ను ఏర్పాటు చేశారు. ప్రతిరాష్ట్రంలోనూ డ్రగ్స్ నియంత్రణ టాస్క్‌ఫోర్స్ ఏర్పాటు చేయాలి. ప్రతికేసును ఎక్కడికక్కడ వదలకుండా వాటి మూలాలను గుర్తించేందుకు డీజీ స్థాయిలో జాయింట్ కమిటీ ఏర్పాటు చేయాలి. నౌకల ద్వారా సరిహద్దు ప్రాంతాలకు వచ్చే అవకాశం ఉన్నందున తీరంలో గస్తీ పోలీసు బలగాలు ఏర్పాటు చేయాలి. డ్రగ్స్ రవాణాపై హెల్ప్‌లైన్ 1933 సమగ్రంగా పనిచేసేలా చూడాలి.

ఏసీ గదుల్లోనే సాగు

హైడ్రోగంజాయి సాగుకు హైడ్రోపోలిక్ టెక్నాలజీ ఏసీ గదులను వినియోగిస్తున్నారు. దేశంలో వ్యవసాయం, పశుగ్రాసం కోసం ఈ వ్యవస్థను తీసుకొచ్చారు. కృత్రిమంగా లైటింగ్ వ్యవస్థ ఏర్పాటు చేసి గంజాయిని ఉత్పత్తి చేస్తున్నారు. స్థలం తక్కువైనా కేజీల కొద్దీ సాగు చేసే వీలుంది.

హైడ్రోగంజాయి రవాణాలో ఐదుగురు అరెస్టు - కమిషనర్

హైడ్రోగంజాయి అక్రమ రవాణాకు సంబంధించి ఐదుగురుని అరెస్టు చేశామని బెంగళూరు పోలీస్ కమిషనర్ సీమంత్‌కుమార్‌సింగ్ తెలిపారు. పోస్టాఫీసులు, కొరియర్ ద్వారా స్మగ్లింగ్‌కు పాల్పడుతున్నట్లు గుర్తించామన్నారు. డ్రగ్స్‌ను గుర్తించేందుకు స్నిఫర్‌డాగ్‌లను అందుబాటులో ఉంచామన్నారు. డార్క్‌వెబ్‌లో కొనుగోలు చేస్తున్నారన్నారు. అనుమానాస్పద చిరునామాలనుంచి పార్సిల్స్ వస్తున్నాయని, పాత డ్రగ్ పెడ్లర్‌లనుంచి సమాచారం సేకరించి మూలాలను గుర్తించేందుకు కార్యాచరణ చేస్తున్నామన్నారు.

2023 నుంచి 2025 వరకు కేసులు

రాష్ట్రం	కేసులు	అరెస్టు	జప్తు కేజీలలో
కర్ణాటక	49	38	294
మహారాష్ట్ర	45	19	137
తమిళనాడు	64	28	194
గుజరాత్	32	10	112
పశ్చిమబెంగాల్	16	21	90
ఆంధ్రప్రదేశ్	1	-	0.77
అస్సాం	1	1	10
కేరళ	2	5	3
గోవా	3	1	0.17
రాజస్థాన్	2	1	4
తెలంగాణ	1	2	11
ఢిల్లీ	11	13	45
ఒడిశా	2	2	11



పోలీసులు స్వాధీనం చేసుకున్న గంజాయి (ఫైల్)



విదేశాల నుంచి దిగుమతి

రాష్ట్రవ్యాప్తంగా నార్కోటిక్స్ కంట్రోల్ బ్యూరో (ఎన్‌సీబీ) సమాచారం ప్రకారం ఈ ఏడాది జనవరి నుంచి మే చివరివరకు 158 కేజీల హైడ్రోగంజాయిని స్వాధీనం చేసుకున్నారు. 26 కేసులు నమోదు చేశారు. ఇతర రాష్ట్రాలతో పోలిస్తే కర్ణాటకకు అధికంగా దిగుమతి అవుతున్నట్లు తెలుస్తోంది. 2023నుంచి 2025 మే వరకు రాష్ట్రంలో 43 స్మగ్లింగ్ కేసులు నమోదయ్యాయి. అందులో 294 కేజీల హైడ్రోగంజాయిని స్వాధీనం చేసుకున్నారు. కొన్నేళ్లకాలంగా హైడ్రోగంజాయి థాయ్‌ల్యాండ్‌లో విరివిగా సాగు చేస్తున్నారు. అక్కడనుంచి భారత్‌కు అక్రమ మార్గంలో తరలిస్తున్నారు. తనిఖీలు జరుపుతున్నందున ప్రయాణీకులు వెంట తీసుకురావడం మాని కొరియర్‌ల ద్వారా స్మగ్లింగ్‌కు పాల్పడుతున్నారు. ఈ మేడాది 25నుంచి 29 వరకు థాయ్‌ల్యాండ్‌లోని బ్యాంకాక్‌లో జరిగిన ఓ సదస్సులో హైడ్రోగంజాయి రవాణాకు సంబంధించి దర్యాప్తు సంస్థలు ప్రస్తావించాయి. ఔషధాలకోసం అమెరికా, థాయ్‌ల్యాండ్, జర్మనీ, ఉరుగ్వే, దక్షిణాఫ్రికాతోపాటు మరికొన్ని దేశాల్లో హైడ్రోగంజాయి సాగు చేసేందుకు చట్టపరమైన అవకాశాలు ఉన్నాయి. మనదేశంతోపాటు పలు దేశాలలో హైడ్రోగంజాయి అనేది చట్టరీత్యా వ్యతిరేకమైనది. థాయ్‌ల్యాండ్, మరికొన్ని దేశాలనుంచి కొరియర్ పార్సిల్ దూరంలో దిగుమతి అవుతున్నట్టు ఎన్‌సీబీ అధికారులు పేర్కొంటున్నారు.



వేరుశనగ కాయల అలంకరణలో కాడు మల్లీశ్వరస్వామి

మల్లీశ్వరుడి సన్నిధి.. వేరుశనగ సందడి

● ఘనంగా వేరుశనగ పరుష ప్రారంభం ● తరలివచ్చిన భక్తులు

బెంగళూరు, నవంబరు 9 (ఆంధ్రజ్యోతి): కార్తీకమాసాన్ని పురస్కరించుకుని మల్లేశ్వరంలోని కాడు మల్లీశ్వర ఆలయంలో ఆదివారం శనక్కాయల పరుష ప్రారంభమైంది. మూడు రోజుల పాటు పరుష జరగనుంది. వేలాదిమంది భక్తులు పాల్గొన్నారు. ఏటా కార్తీకమాసం మూడో సోమవారానికి అనుబంధంగా మూడురోజులపాటు శనక్కాయల పరుష నిర్వహించడం ఆనవాయితీ. మల్లేశ్వరంలో పండుగ శోభ నెలకొంది. రాష్ట్రంలోని వివిధ జిల్లాలతోపాటు తమిళనాడునుంచి పెద్ద ఎత్తున సుమారు 10 రకాల వేరుశనక్కాయలు జాతరలో అమ్మకానికి ఉంచారు. ఆదివారం కావడంతో ప్రజలు విశేషంగా తరలివచ్చారు.



జాతరలో చింపాంజీ వేషధారుడితో..



వేరుశనగ కాయలను కొనుగోలు చేస్తున్న మహిళలు



తుంగభద్ర నీటి మట్టం : 1633 అడుగులు

	ప్రస్తుతం	గత ఏడాది
నీటి మట్టం (అడుగులు)	1625.48	1632.00
ఇన్‌ఫ్లో (క్యూసెక్కులు)	2,263	8,567
ఔట్ ఫ్లో (క్యూసెక్కులు)	8,537	10,016
నీటి నిల్వ (టీఎంసీలు)	78.07	101.50

విద్యార్థులకు ప్రశంసాపత్రాల అందజేత



విద్యార్థులను అభినందిస్తున్న ప్రిన్సిపాల్ పంపాపతి

సిరుగుప్ప, నవంబరు 9(ఆంధ్రజ్యోతి): కుస్తీ పోటీల్లో గెలుపొందిన విద్యార్థులకు డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ పంపాపతి ప్రశంసాపత్రాలు అందజేశారు. విజయనగరం జిల్లా శ్రీకృష్ణదేవరాయ మహా విద్యాలయంలో జరిగిన కుస్తీ పోటీల్లో సిరుగుప్ప డిగ్రీ కళాశాల విద్యార్థులు ప్రతిభ కనబరిచినట్లు ఆయన తెలిపారు. కళాశాల విద్యార్థులు, ఉపన్యాసకులు తాలుకా ప్రజలు హర్షం వ్యక్తం చేశారు. డివిజన్, రాష్ట్రస్థాయిలో ఉత్తమ ప్రతిభ కనబరచాలని వారు ఆకాంక్షించారు.

బాలకార్మిక వ్యవస్థను నిర్మూలించాలి



మాట్లాడుతున్న తహసీల్దార్ గౌసియా బేగమ్

సిరుగుప్ప, నవంబరు 9(ఆంధ్రజ్యోతి): బాల కార్మికులను నివారించాలని తహసీల్దార్ గౌసియా బేగమ్ అన్నారు. పట్టణం తహసీల్దార్ కార్యాలయంలో బాల కార్మికులను అరికట్టడంపై టాస్క్‌ఫోర్స్ సభ నిర్వహించారు. సభలో తహసీల్దార్ మాట్లాడుతూ నేటి రోజుల్లో పిల్లలను పనులలో పెట్టుకున్న వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని బాలకార్మిక నిరోధక శాఖ ఇన్‌స్పెక్టర్ తిరుమలేష్‌ను ఆదేశించారు. నేటి బాలలే రేపటి పౌరులని ఆమె అన్నారు. డీటీ సిద్ధార్థ, సిబ్బంది పాల్గొన్నారు.

ఉత్సాహంగా జర్నలిస్టు సంఘం పోలింగ్



పోలింగ్‌లో పాల్గొన్న జర్నలిస్టులు

రాయచూరు, నవంబరు 9(ఆంధ్రజ్యోతి): కర్ణాటక వర్కింగ్ జర్నలిస్ట్ యూనియన్ జిల్లా పదాధికారుల ఎన్నికల పోలింగ్ ఆదివారం ఉత్సాహంగా సాగింది. నగరంలోని పత్రికా భవన్‌లో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో వివిధ తాలూకాలకు చెందిన పాత్రికేయులు పెద్ద సంఖ్యలో వచ్చి తమ ఓటు హక్కు వినియోగించుకున్నారు. జిల్లా అధ్యక్ష స్థానం మూడు ఉపాధ్యక్ష స్థానాలు ఒక ప్రధాన కార్యదర్శి, ముగ్గురు కార్యదర్శులు, కోశాధికారితో పాటు రాష్ట్ర సమితి కార్యదర్శులుగా ముగ్గురు, మొత్తం 15 స్థానాల కోసం ఎన్నికలు నిర్వహించారు. ఎన్నికల రిటర్నింగ్ అధికారిగా తహసీల్దార్ ఉప అధికారిలో వ్యవహరించారు.

మతిస్థిమితం లేని వ్యక్తి ఆత్మహత్య

మడకశిర రూరల్, నవంబరు 9(ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని మణూరు గ్రామానికి చెందిన కదురప్ప (45) ఆత్మహత్య చేసుకున్నట్లు పోలీసులు తెలిపారు. కదురప్ప గతంలో బెంగళూరులో కూలిపని చేస్తుండేవాడు. అయితే ప్రమాదవశాత్తు భవనంపై నుంచి కాలుజారి కిందపడటంతో తలకు బలమైన దెబ్బతగిలింది. ఆపరేషన్ చేయించారు. అప్పటి నుంచి అతడికి మతిస్థిమితం లేదు. కాగా ఈనెల 4న ఉదయం ఇంటినుంచి బయటకువెళ్లాడు. సాయంత్రమైనా ఇంటికి రాకపోవడంతో కుటుంబ సభ్యులు అతడి కోసం గాలించారు. అయినా ఆచూకీ లభ్యంకాలేదు. శనివారం గ్రామ సమీపంలోని పొలం వద్ద చెట్టుకు ఉరి వేసుకుని ఉండటాన్ని గమనించిన స్థానికులు మృతుడి కుటుంబ సభ్యులకు సమాచారం అందించారు. వారు పోలీసులకు తెలుపగా ఆదివారం వారు ఘటనా స్థలాన్ని పరిశీలించారు. మృ తుడి భార్య గంగమ్మ ఫిర్యాదు మేరకు పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

కూలీ కుటుంబంలో వికసించిన విద్యాకుసుమం

● ఐఐటీలో సీటు సాధించిన రవిచంద్ర



తల్లిదండ్రులతో విద్యార్థి రవిచంద్ర

బళ్లారి గాంధీనగర్, నవంబరు9(ఆంధ్రజ్యోతి): తల్లితండ్రులు ఇటుక బట్టీలో కూలీలు. తల్లిదండ్రుల పేదరికాన్ని తలుచుకుని కుంగిపోకుండా ఐఐటీ మెకానికల్ విభాగంలో సీటు సంపాదించి తల్లితండ్రుల కష్టానికి సార్థకత చేకూర్చాడు రవిచంద్ర. జాతీయస్థాయిలో 1201 ర్యాంకు సాధించి నేటి యువతకు ఆదర్శంగా నిలిచాడు. చిత్రదుర్గ జిల్లా, మొలకాల్మూరు తాలూకా మర్లహళ్ళి గ్రామానికి చెందిన రవిచంద్ర అనే యువకుడు తల్లితండ్రులు కన్న కలలను సాకారం చేశాడు. తల్లిదండ్రులు పేదరికం ఉన్నా... రవిచంద్ర విద్యలో పేదరికం లేదు. ఇటుకల బట్టీలో కూలీపనులు చేస్తూ కుమారుడిని ఉన్నత చదువులే లక్ష్యంగా చదివించారు. వారి కష్టాన్ని వమ్ముచేయకుండా జేఈఈకి ఎలాంటి కోచింగ్ తీసుకోకుండా పగలురాత్రి కష్టపడి ఐఐటీ సీటు సాధించి జిల్లాకు కీర్తి తెచ్చిపెట్టాడు రవిచంద్ర. కొడుకును ఎలాగైనా విద్యావంతుడిని చేయాలే పట్టుదల ఉంటే పేదరికం అడ్డురాదని అంటున్నారని



పనుల్లో నిమగ్నమైన తల్లిదండ్రులు భాగ్యమ్మ, మల్లేశ్

తల్లితండ్రులు భాగ్యమ్మ, మల్లేశ్. వీరు విజయనగర జిల్లా పరిధిలోని కూడ్లిగి తాలూకాకు చెందిన వలస కార్మికులు. 13 సంవత్సరాల క్రితం పొట్టకూటి కోసం మర్లహళ్ళి గ్రామానికి వచ్చి అక్కడే ఇటుకలబట్టీలో కార్మికులుగా పని చేస్తూ జీవనం సాగిస్తున్నారు. రవిచంద్ర 1వ తరగతి నుంచి 5వ తరగతి వరకు కూడ్లిగి వలస గ్రామ ప్రభుత్వ పాఠశాలలో చదివాడు. అనంతరం ప్రభుత్వం నిర్వహించే రెసిడెన్షియల్ పాఠశాల ప్రవేశ పరీక్షలో ఉత్తీర్ణుడై బళ్లారి జిల్లా పరిధిలోని కురుగోడు తాలూకా ముష్టగట్టి మొరార్జీ దేశాయి పాఠశాలలో 10వ తరగతి వరకు చదువుకున్నాడు. అనంతరం విజయనగర జిల్లా హొసపేట తాలూకా తిమ్మాపుర మొరార్జీదుశాయ్ పీయూ కళాశాలలో ఇంటర్ చదివాడు. ఈ కళాశాలలో ఇచ్చిన కోచింగ్ ఆధారంగానే జేఈఈ మెయిన్స్‌లో ర్యాంకు సాధించి ధారవాడలోని ఐఐటీ ఇంజనీరింగ్ కళాశాలలో మెకానికల్ విభాగంలో సీటు సాధించాడు. కళాశాల ఉపన్యాసకులు, సీనియర్ విద్యార్థుల మార్గదర్శనంతో సీటు సాధించినట్లు రవిచంద్ర తెలిపాడు. ర్యాంకు సాధించడం పట్ల తల్లితండ్రుల సంతోషానికి హద్దులు లేకుండాపోయాయి.

కొనసాగుతున్న వ్యక్తిత్వ వికాస శిబిరం



మాట్లాడుతున్న ఏఐడీఎస్ఓ రాష్ట్ర కార్యదర్శి మహంతేశ్ బిలూర్

బళ్లారి సిటీ, నవంబరు 9(ఆంధ్రజ్యోతి): జిల్లాలోని దమ్మూరు సమీపం వెంకావధూత మఠంలో వ్యక్తిత్వ వికాస శిబిరం ఆదివారం రెండోరోజూ కొనసాగింది. కార్యక్రమానికి చుట్టు పక్కల గ్రామాల విద్యార్థులు తరలివచ్చారు. సామాజిక మార్పులో విద్యార్థుల పాత్ర' అనే అంశంపై ఏఐడీఎస్ఓ కర్ణాటక రాష్ట్ర కార్యాలయ కార్యదర్శి మహంతేశ్ బిలూర్ ప్రసంగించారు. స్వాతంత్ర్య ఉద్యమం లక్ష్యం బ్రిటీషు వారిని పారదోలడమే కాకుకుండా కులం, మతం, లింగం, ఆర్థిక వ్యవస్థ పేరుతో ఉన్న దోపిడీ, సామాజిక అసమానతలను అంతం చేయడమే లక్ష్యంది. అయితే అవి నేటికీ నెరవేరలేదన్న వాస్తవాన్ని ఆయన ఎత్తిచూపారు. ఏఐడీఎస్ఓ విద్య సంస్కృతి, మానవత్వాన్ని కాపాడలనే నినాదంతో దేశవ్యాప్తంగా శిబిరాలు, కార్యక్రమాలను నిర్వహిస్తోందన్నారు. నేడు మనం విద్య సంస్కృతిని కాపాడకపోతే రేపు సామాజిక మార్పు జెండాను ఎగురువేయడానికి ఒక్క విద్యార్థి మిగిలి ఉండడన్నారు. నేడు ప్రభుత్వ సంస్థలను కాపాడే బాధ్యత మనపై ఉందన్నారు. సమాజాన్ని పీడిస్తున్న సమస్యలను అంతం చేయడానికి ఏఐడీఎస్ఓ బలోపేతం చేయాలని ఆయన పిలుపునిచ్చారు. కార్యక్రమంలో జిల్లా కార్యదర్శి కంబలిమంజునాథ్, జిల్లాధ్యక్షుడు ఈరన్న, శాంతి, సమీర్, తిప్పేస్వామి, కాంతేశ్, రంజిత్, అర్జున్, హరీశ్, సుమిత్ర, అంకిత, శివ, వినోద్, మంజునాథ్, ప్రవీణ్ పాల్గొన్నారు.

శ్మశాన వాటిక సమస్య తీరేదెన్నడు?

● దశాబ్దాలుగా నీటి గుంతల్లోనే ఖననం

● ఇబ్బంది పడుతున్న హొసపేట వాసులు



నీరున్న గుంతలోనే అంతిమ సంస్కారాలు చేస్తున్న ప్రజలు

బళ్లారి సిటీ, నవంబరు 9(ఆంధ్రజ్యోతి): విజయనగరం జిల్లా హొసపేట బళ్లారి రోడ్డులోని అంబాభవాని ఆలయం వెనుక శ్మశానవాటికఉంది. ఇక్కడ మృతదేహాన్ని ఖననం చేయడానికి నీటిని ఒక బకెట్‌లో బయటకు పంపాలి. ఆనీరు మళ్లీ గుంతలోకి వస్తాయి. చివరికి మృతదేహాన్ని నీటిలో పాతిపెట్టి అంత్యక్రియలు నిర్వహించేదయనీయ పరిస్థితి ఇక్కడ ఉంది. ఎమ్మెల్యేలు, కౌన్సిల్ సభ్యులు అధికారులతో సహా అందరికీ దీని గురించి తెలుసు. అయినా ఎవరూ పట్టించుకున్న పాపాన పోలేదు. స్థానికులు ఫిర్యాదు చేసినా స్పందన లేదు. చనిపోయిన వారు జీవితకాలంలో గౌరవప్రదమైన జీవితాన్ని గడిపారో లేదో కాని మరణించిన తర్వాత వారిని గౌరవంగా పంపకూడదా అని స్థానికులు ప్రశ్నిస్తున్నారు. ఖననం కోసం గుంతను తవ్వితే వెంటనే అందులోకి నీరు వస్తున్నాయి. తడిభూములు లేని ప్రాంతంలో శ్మశాన వాటిక ఏర్పాటు చేయాలని దశాబ్దాలుగా కోరుతున్నా పట్టించుకున్న పాలకులు, అధికారులు లేకపోవడం గమనార్హం. దీనిపై మనిక్షపల్ కమిషనర్ శివకుమార్‌ను వివరణ కోరగా ఆ ప్రాంతాన్ని పరిశీలించి ప్రజలకు ఇబ్బందులు లేకుండా చర్యలు తీసుకుంటామని ఆయన అన్నారు.

సాహిత్య సేవలతో గుర్తింపు పొందాలి

● కన్నడ సాహిత్య పరిషత్ జిల్లా అధ్యక్షుడు రంగణ్ణ అల్లుండి



కసాప నూతన పదాధికారులను సన్మానిస్తున్న దృశ్యం

రాయచూరు, నవంబరు 9(ఆంధ్రజ్యోతి): జిల్లాలోని కవులు, రచయితులు సాహితీవేత్తలు సాహితీ సేవతో జాతీయ స్థాయిలో గుర్తింపు తెచ్చుకోవాలని కన్నడ సాహిత్య పరిషత్ జిల్లాధ్యక్షుడు రంగణ్ణ అల్లుండి సూచించారు. ఇటీవల కొత్తగా ఏర్పాటైన రాయచూరు తాలూకా కన్నడ సాహిత్య పరిషత్ పదాధికారులతో ఆదివారం నగరంలోని కన్నడ భవనంలో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ గతంలో అనేక మంది జిల్లాకు చెందిన సాహితీవేత్తలు రాష్ట్ర, జాతీయ స్థాయిల్లో తగిన గుర్తింపు, గౌరవాన్ని దక్కించుకున్నారన్నారు. వారి పేరును సార్థకం చేసుకునేలా నేటితరం యువ రచయితలు, సాహితీవేత్తలు, కవులు, కళాకారులు తమ ప్రతిభకు పదను పెట్టాలన్నారు.

శాంతియుతంగా జీవించండి: సీఐ

చిలమత్తూరు, నవంబరు 9(ఆంధ్రజ్యోతి): గ్రామాల్లో ఘర్షణలు పడకుండా శాంతియుతంగా జీవించాలని హిందూపురం రూరల్ సీఐ జనార్దన్ సూచించారు. మండలంలోని రొద్దంవారిపల్లి, మాదిరెడ్డిపల్లి, ఎస్.కొత్తపల్లి గ్రామాల్లో ఆదివారం ప్రజలతో సమావేశమై సమస్యలను అడిగి తెలుసుకున్నారు. లా అండ్ ఆర్డర్‌కి సంబంధించిన సమస్యలు ఉంటే తమ దృష్టికి తీసుకురావాలన్నారు. వచ్చిన సమస్యలను వెంటనే పరిష్కరించేందుకు చర్యలు తీసుకుంటామన్నారు. గ్రామాల్లో కొత్త వ్యక్తులు సంచరించినా, అనుమానాస్పదంగా ఎవరైనా తిరుగుతున్నా వెంటనే సమాచారం ఇవ్వాలన్నారు. మహిళల రక్షణకై ప్రత్యేక చట్టాలు ఉన్నాయని, వాటిని గుర్తించి మసలుకోవాలన్నారు. మహిళలకు ఎవరైనా ఇబ్బందులు కలిగిస్తున్నట్లైతే వెంటనే సమాచారం ఇస్తే చర్యలు తీసుకుంటామన్నారు. రోడ్డు నిబంధనలు పాటిస్తూ వాహనాలు నడపాలని సూచించారు.



రొద్దంవారిపల్లిలో గ్రామస్థులతో మాట్లాడుతున్న సీఐ



రెజ్లింగ్‌లో తలపడుతున్న క్రీడాకారులు

రెజ్లింగ్ పోటీల్లో విద్యార్థుల ప్రతిభ

బళ్లారి సిటీ, నవంబరు 9(ఆంధ్రజ్యోతి): విజయనగరం జిల్లా మరియమ్మన హళ్ళి పట్టణంలోని వినాయక్ హైస్కూల్ మైదానంలో శనివారం జరిగిన అండర్-14,17 రాష్ట్రస్థాయి రెజ్లింగ్ పోటీల్లో బాగల్‌కోట్‌కు చెందిన విద్యార్థులు ప్రతిభ కబరిచారు. విద్యార్థులు మోహన్ స్వర్ణం, గదగ్‌కు చెందిన రాహుల్ రజతం, బెల్గాంకు చెందిన శ్రీరాజ్ పాటిల్ 110కిలోల విభాగం గ్రీకో రోమన్ స్టైల్ మ్యాచ్‌లో కాంస్య పతకం సాధించారు. వివిధ విభాగాల్లో 45కేజీల విభాగం శివానంద్(విజయపూర్), ఖాసీం(బెలగావి), 48కేజీలు మారెప్ప (ధార్వాడ), జావేద్(శిరాసి), 51 కేజీల శివప్ప(గాగల్‌కోట్), సందీప్ ధార్వాడ, 60కేజీలు ఆకాష్(బాగల్‌కోట్), దాదాపీర్ (ధార్వాడ), 65 కేజీలు అర్షద్ (చిక్కోడి), తిమ్మేశ్(దావణగెరె), అండర్-17 ఫ్రీ స్టైల్ రెజ్లింగ్‌లో 45కేజీల విభాగం మాదేశ్ (ధార్వాడ), మల్లిక్ రెహాన్(బెలగావి) గెలుపొందారు.

విద్యార్థులపైనే దేశ భవిష్యత్తు

● కమ్మ సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు చంద్రశేఖర్



విద్యార్థులకు స్కాలర్‌షిప్‌లు పంపిణీ చేసిన జలాది రాధాకృష్ణ, ప్రముఖులు

సిరుగుప్ప, నవంబరు 9 (ఆంధ్రజ్యోతి): దేశ భవిష్యత్తు విద్యార్థులపై ఆధారపడి ఉందని కమ్మసంఘం జిల్లా ఉపాధ్యక్షుడు ముల్లంగి చంద్రశేఖర్ చౌదరి అన్నారు. ఆదివారం సిరుగుప్ప పట్టణంలో కమ్మసంఘం తాలుకా అధ్యక్షుడు జలాది రాధాకృష్ణ ఆధ్వర్యంలో కార్తీక వన భోజనం నిర్వహించారు. మొదట సంప్రదాయబద్ధంగా ఉసిరి చెట్టుకు పూజలు చేశారు. అనంతరం ప్రతిభా వంత విద్యార్థులకు స్కాలర్‌షిప్‌లు పంపిణీ చేశారు. తాలుకా వ్యాప్తంగా వున్న కమ్మ సంఘం ప్రముఖులు పాల్గొని వన భోజనాన్ని ఆరగించారు. సంఘం కన్వీనర్ రఘు కిరణ్, ఉపాధ్యక్షుడు ప్రసాద్, కార్యదర్శి గాజుల సురేష్, సత్యనారాయణ, కోశాధికారి చౌదరి, మాజీ అధ్యక్షుడు రమేష్ బాబు, కోనేరు గోపాల కృష్ణ, మహిళలు, విద్యార్థులు పాల్గొన్నారు.

ప్రజల ఆరోగ్యానికి ప్రభుత్వం పెద్దపీట

● రాష్ట్ర చిన్ననీటి పారుదల శాఖ మంత్రి భోసరాజు



అభివృద్ధి పనులకు భూమిపూజ చేస్తున్న మంత్రి భోసరాజు, ఎమ్మెల్యే

రాయచూరు, నవంబరు 9 (ఆంధ్రజ్యోతి) : కల్యాణ కర్ణాటక ప్రాంతంలోని ప్రజలకు మెరుగైన ఆరోగ్యం అందించేందుకు ప్రభుత్వం కట్టుబడి ఉందని రాష్ట్ర చిన్ననీటి పారుదల శాఖ మంత్రి ఎన్.ఎస్.భోసరాజు అన్నారు. కల్యాణ కర్ణాటక అభివృద్ధి మండలి ద్వార ఈ ప్రాంతంలో ఆరోగ్య అభివృద్ధి కార్యక్రమాల కోసం ప్రభుత్వం రూ.850 కోట్లను మంజూరు చేసినట్లు మంత్రి తెలిపారు. సిరవార తాలూకా కేంద్రంలోని సముదాయ ఆరోగ్య కేంద్ర ఆవరణలో వైద్య ఆరోగ్య శాఖ సిబ్బంది కోసం నిర్మిస్తున్న నివాస గృహాల సముదాయానికి స్థానిక ఎమ్మెల్యే హంపయ్య నాయక్‌తో కలిసి మంత్రి ఆదివారం భూమి పూజ చేశారు. ఈ సందర్భంగా మాట్లాడిన మంత్రి ఎన్.ఎస్.భోసరాజు, ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలను పటిష్టం చేయడంతో పాటు డాక్టర్‌ల కొరతను నివారించడం పై ప్రభుత్వం ప్రత్యేకంగా దృష్టి సారించిందన్నారు. సౌకర్యాల కొరత పేరుతో ప్రజల ఆరోగ్యం పట్ల ఏ మాత్రం నిర్లక్ష్యం వహించకుండా వైద్యాధికారులు ఎప్పటికప్పుడు సేవలందించాలని సూచించారు. వైద్య నారాయణో హరి అన్న సూత్రాన్ని గుర్తెరిగి పేదలకు వైద్యసేవలందించడాన్ని దైవ కార్యంగా భావించాలని వైద్యాధికారులకు హితవుపలికారు.

వైసీపీ హయాంలో పరిశ్రమలకు ఆటంకాలు

మంత్రి అనగాని సత్యప్రసాద్

పెనుకొండ టౌన్, నవంబరు 9(ఆంధ్రజ్యోతి): వైసీపీ రాక్షస ప్రభుత్వహయాంలో పరిశ్రమలకు ఈ ప్రాంతంలో ఆటంకం కలిగిందని రెవెన్యూ మంత్రి అనగాని సత్యప్రసాద్ పేర్కొన్నారు. అనంతపురం ఆర్టీటీ స్టేడియంలో ఆదివారం రెవెన్యూ స్పోర్ట్స్‌లో పాల్గొనేందుకు వెళ్తున్న మంత్రి సత్యప్రసాద్ పెనుకొండలోని టీడీపీ కార్యాలయంలో మంత్రి సవితతో కలిసి సీఎం సహాయనిధి చెక్కులను పంపిణీ చేశారు. 42 మందికి రూ.38లక్షలు అందించారు. ఈ సందర్భంగా మంత్రి అనగాని సత్యప్రసాద్ మాట్లాడుతూ 2014-19సంవత్సరంలో సీఎం చంద్రబాబు చొరవతో కియా, అనుబంధ పరిశ్రమలు తీసుకొచ్చామన్నారు. అదే తరహాలో మరిన్ని పరిశ్రమలు పెనుకొండ, హిందూపురానికి రానున్నాయన్నారు. పేద, మధ్యతరగతి కుటుంబాలకు సీఎం సహాయ నిధి ఊరటనిస్తుందన్నారు.

హొసూరు జోన్

గెయిల్ గ్యాస్ పైప్‌లైన్ లీకేజీ.. ప్రజల్లో భయాందోళనలు

హొసూరు, నవంబరు 9(ఆంధ్రజ్యోతి): హొసూరులోని సిప్‌కాట్ ప్రాంతం గుండా వెళుతున్న గెయిల్ గ్యాస్ పైప్‌లైన్ నుంచి లీకేజీ సంభవించడంతో ప్రజలు ఆందోళన చెందుతున్నారు. కేరళలోని కొచ్చి నుంచి కర్ణాటకలోని బెంగళూరు, మంగళూరు వరకు తమిళనాడులోని 7 జిల్లాల ద్వారా గెయిల్ గ్యాస్ పైప్‌లైన్ సాగుతుంది. అదేవిధంగా హొసూరులోని సిప్‌కాట్ విద్యుత్ శాఖ కార్యాలయం సమీపంలో గ్యాస్ పైప్‌లైన్ ఉంది. ఆదివారం మధ్యాహ్నం 12 గంటల ప్రాంతంలో ఈ పైప్‌లైన్ నుంచి లీకేజీ సంభవించింది. విషయం తెలుసుకున్న స్థానికులు అగ్నిమాపక శాఖకు సమాచారం అందించారు. హొసూరు అగ్నిమాపక స్టేషన్ అధికారి నాగవిజయన్ నేతృత్వంలోని 10 మంది బృందం చేరుకుంది. ఈ మార్గంలోని వెళ్తున్న వాహనాలను ప్రత్యామ్నాయ మార్గంలో మళ్లించారు. అగ్నిమాపక శాఖ గుండా గెయిల్ అధికారులకు ఈ విషయాన్ని తెలియజేశారు. తర్వాత గెయిల్ అధికారులు మధ్యాహ్నం 1.30 గంటల ప్రాంతంలో లీకేజీని నివారించడానికి హైస్కూల్ వద్ద గేటును లాక్ చేశారు. గెయిల్ ఉద్యోగులు మరమ్మతు చేసి పనిలో నిమగ్నమైయ్యారు. ప్రజలు దీని గురించి మాట్లాడుతూ గత ఏప్రిల్‌లో హొసూరులోని సిప్‌కాట్ గుండా వెళుతున్న గెయిల్ గ్యాస్ పైప్‌లైన్ లీక్ అయ్యిందన్నారు. తరచూ ఇలాంటి లీకేజీతో బెంబేలు చెందాల్సి వస్తోందని విచారం వ్యక్తం చేశారు. గెయిల్ టోల్-ఫ్రీ నంబర్‌కు కాల్ చేసినా స్పందన లేదన్నారు. ఒకవేళ ఎవరైనా ఏదైనా విషయం చెబితే తమకు భాష అర్థం కావడం లేదని, హిందీ మాత్రమే వచ్చని బదులిస్తారన్నారు. ఇలాంటి తరుణంలో సమస్య ఎవరికీ చెప్పాలో అర్థం కావడం లేదన్నారు.



మరమ్మతులు చేపడుతున్న అధికారులు, సిబ్బంది

సంప్రదాయ క్రీడల రక్షణకు ఏకమైన యువత

హొసూరు, నవంబరు 9(ఆంధ్రజ్యోతి): తమిళనాడులోని మాటుపొంగల్ సందర్భంగా పుదుకోట్టై, మధురై, తేని వంటి జిల్లాల్లో జల్లికట్టుకు ప్రసిద్ధి. కృష్ణగిరి, వేలూరు, ధర్మపురి జిల్లాలు, కర్ణాటక, ఆంధ్రప్రదేశ్‌లోని కుప్పంలో అత్తుకట్టు అనే ఎద్దులు పండుగలకు బాగా ప్రసిద్ధి చెందినవి. పోటీలకోసం దేశీయ ఆవులను పెంచడానికి యువత ఆసక్తి చూపుతున్నారు. కొమ్ములు కట్టి, పోటీల్లో పాల్గొని బహుమతులు కూడా గెలుచుకుంటారు. అలాగే వాటిని నిగ్రహించి కొమ్ములను పట్టుకునే యోధులకు అతుకట్టు ఉత్సవాల సమయంలో గంభీరంగా నడిచే ఆవులు, దూసుకుపోయే ఆవులు అత్యంత ప్రసిద్ధి చెందాయి. ప్రతి సంవత్సరం ఆవులను వేలంలో కూడా పాడుకుంటారు. ఇటీవలి సంవత్సరాలలో ఎద్దుల స్వారీ ఉత్సవాలకు సంక్లిష్టమైన విధానాలను అనుసరించాలనే పట్టుదల కారణంగా ఉత్సవాలను నిర్వహించలేమనే ఆరోపణలు ఉన్నాయి. ముఖ్యంగా జల్లికట్టు ఉత్సవాలకు సంబంధించిన మార్గదర్శకాలను అతుకట్టు పండుగ సమయంలో కూడా పాటించాలి కాబట్టి, ఈ ప్రాంతంలో ఎద్దుల స్వారీ ఉత్సవాలను నిర్వహించడం కష్టంగా మారింది. వచ్చే ఏడాది తమిళనాడు అసెంబ్లీ ఎన్నికలు జరగనుండడంతో దీనిని ఒక నెపంలా చూపుతూ ప్రభుత్వం అతుకట్టు ఉత్సవాలకు అనుమతి నిరాకరించవచ్చనే కథనాలు జోరందుకున్నాయి. కృష్ణగిరి జిల్లా హొసూరు సమీపంలోని సీకనపల్లి ప్రాంతంలో అతుకట్టు సంక్షేమ సంఘం తరఫున సమావేశం జరిగింది. సమావేశానికి అతుకట్టు సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షుడు కృష్ణమూర్తి అధ్యక్షత వహించారు. ధర్మపురి, తిరువణ్ణామలై, తిరుపత్తూరు, వేలూరు జిల్లా మంజువిరాట్టు, విశ్వ సంఘ నాయకులు ప్రత్యేక ఆహ్వానితులుగా పాల్గొన్నారు. . దేశీయ ఆవులను రక్షించుకుందాం, అతుకట్టు ఉత్సవాలను పునరుద్ధరిద్దాం అనే అంశంపై సమావేశంలో చర్చలు జరిగాయి. 2వేలమందిపైగా యువకులు స్వచ్ఛందంగా పాల్గొన్నారు. అతుకట్టు సంక్షేమ సంఘం రెండు ప్రైవేట్ ఆసుపత్రుల నిర్వహణ ద్వారా ఉచిత వైద్య పరీక్షలు, పశువైద్యశాల ద్వారా దేశీయ ఆవులకు అవసరమైన పోషకాహారం, మందులను అందించడానికి ఏర్పాట్లు చేయాలని డిమాండ్ చేశారు. ఎద్దులు, ఆవుల మాదిరిగానే సాంప్రదాయ పద్ధతిలో ఎద్దుల పెంపకం ఉత్సవాలకు సిద్ధం చేయడానికి వారు 10 కంటే ఎక్కువ తీర్మానాలు తీసుకోవాలి. జల్లికట్టు ఎద్దుల పోరాటాలకు ప్రభుత్వ ఉత్తర్వుల మాదిరిగానే అతుకట్టు ఉత్సవాలకు ప్రత్యేక ప్రభుత్వ ఉత్వర్వు జారీచేయాలని డిమాండ్ చేశారు. ఎన్నికలను సాకుగా చూపుతూ 2026 లో అతుకట్టు ఉత్సవాలకు అనుమతులను తిరస్కరించరాదన్నారు. సంప్రదాయాన్ని పునరుద్ధరించడానికి రంగంలోకి దిగిన యవత తీరుపట్ల ప్రశంసలు వ్యక్తమయ్యాయి.



సమావేశంలో పాల్గొన్న యువకులు

నేటి ప్రముఖులు

పోర్ట్రైట్ ఆర్టిస్ట్ కే.శే. శంకరనారాయణ కాంప్...

విలియం హోగర్త్ (జయంతి)




ఆంగ్ల చిత్రకారుడు విలియం హోగర్త్ 1697 నవంబరు 10న లండన్‌లో జన్మించారు. ప్రింట్ మేకర్‌గా, పిక్టోరియల్ సాటిరిస్ట్‌గా, ఎడిటోరియల్ కార్టూనిస్ట్‌గా రాణించారు. ఫ్రెంచ్, ఇటాలియన్ పెయింటర్లతో స్ఫూర్తి పొందారు. ఆయన గీసిన చిత్రాలు మోడ్రన్ మోరల్ సబ్జెక్ట్స్‌గా పేరొందాయి. అంతేకాక రాజకీయ విమర్శలను సున్నితంగా చూపారు. మూడు శతాబ్దాలు గడిచినా కారికేచరిస్ట్‌లపై తన ప్రభావాన్ని చూపారు. 1764 అక్టోబరు 26న కన్నుమూశారు.

సీపీ బ్రౌన్ (జయంతి)



తొలి తెలుగు శబ్దకోశమును పరిష్కరించి ప్రచురించిన చార్లెస్ ఫిలిప్ బ్రౌన్ 1798 నవంబరు 10న కోల్కత్తాలో జన్మించారు. ఈస్ట్ ఇండియా కంపెనీకి చెందిన బ్రిటీష్ అధికారి. తెలుగు సాహిత్యానికి విశేష కృషి చేసిన ఆంగ్లేయుడు. బ్రౌన్ నిఘంటువును ఇప్పటికీ తెలుగులో ప్రామాణికంగా పరిగణిస్తారు. ఆంధ్ర భాషోద్ధారకుడిగా గౌరవించబడ్డారు. వేమన పద్యాలను సేకరించి, ప్రచురించి, ఆంగ్లంలో అనువదించి ఖండాంతర వ్యాప్తి చేశారు. ఆయన జ్ఞాపకార్థం కడపలో గ్రంథాలయం ఏర్పాటైంది. 1884 డిసెంబరు 12న కన్నుమూశారు.

దత్తోపంత్ ఠేంగడి (జయంతి)



హిందూత్వవాది, భారతీయ కార్మికసంఘం నాయకుడు దత్తోపంత్ బాపూరావ్ ఠేంగడి 1920 నవంబరు 10న మహారాష్ట్ర రాష్ట్రం వార్ధా జిల్లా అర్వి గ్రామంలో జన్మించారు. న్యాయవాది, తత్వవేత్త అయినా ఎంతో సరళంగా జీవించి ఆదర్శంగా నిలిచారు. స్వదేశీ జాగరణ్ మంచ్, భారతీయ మజ్దూర్‌సంఘ్, భారతీయ కిసాన్‌సంఘ్‌ల వ్యవస్థాపకులు. తుదిశ్వాసవరకు ఆర్ఎస్ఎస్ పూర్తి సమయ ప్రచారక్‌గా పనిచేశారు. దేశ సామాజిక, ఆర్థిక జీవన పరిస్థితులపై తనదైనశైలిలో ముద్రవేసి భావితరాలకు మార్గదర్శకం చేశారు. 2004 అక్టోబరు 14న కన్నుమూశారు.

తెన్నేటి విశ్వనాథం (వర్ధంతి)



తెన్నేటి విశ్వనాథం 1895లో విశాఖపట్నంలో జన్మించారు. స్వాతంత్ర్య పోరాట యోధుడు, రాజకీయ నాయకుడు. స్వాతంత్ర్యోద్యమంలో ఐదుసార్లు జైలుకు వెళ్లారు. 1937లో మద్రాసు శాసనసభకు ఎన్నికయ్యారు. రెవెన్యూ, దేవదాయ, న్యాయశాఖల మంత్రిగా వ్యవహరించారు. విశాఖ ఉక్కు కర్మాగారం ఏర్పాటులో ప్రధానపాత్ర పోషించారు. కాఫీ బోర్డు అధ్యక్షుడిగా అరకు లోయలో కాఫీ తోటల సాగుకు ప్రాధాన్యత ఇచ్చారు. 1979 నవంబరు 10న కన్నుమూశారు. 2004లో ఆయన జ్ఞాపకార్థం పోస్టల్‌స్టాంపు విడుదల చేశారు.

టీఎన్ శేషన్ (వర్ధంతి)



దేశ చీఫ్ ఎలెక్షన్ కమిషనర్‌గా 1990 నుంచి 1996 వరకు వ్యవహరించి ఎన్నికల్లో సంస్కరణలు తెచ్చిన తిరునెళ్ళై నారాయణ్ ఐయ్యర్ శేషన్ (టీఎన్ శేషన్) 1932 డిసెంబరు 15న కేరళ రాష్ట్రం పాలక్కాడ్‌లో జన్మించారు. ఐఏఎస్ అధికారిగా, కేబినెట్ సెక్రటరీగా, ప్లానింగ్ కమిషన్ సభ్యుడిగా వ్యవహరించారు. 2017 నవంబరు 10న చెన్నైలో కన్నుమూశారు.

ప్రజలను దారి తప్పిస్తున్న ప్రభుత్వం

▸▸ ఎంపీ సుధాకర్ మండిపాటు



బూత్ ఏజెంట్ల సమావేశంలో ఎంపీ సుధాకర్ తదితరులు

శిడ్లఘట్ట, నవంబరు 9 (ఆంధ్రజ్యోతి): ఐదు గ్యారెంటీ పథకాల పేరిట అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రస్తుతం ఈ పథకాలకు వేలకోట్ల రూపాయలు మళ్లించడంతో ఖజానా ఖాళీ అయ్యిందని అభివృద్ధిని మరిచి ప్రజలను దారి తప్పిస్తోందని చిక్కబళ్ళాపుర ఎంపీ సుధాకర్ మండిపడ్డారు. బీజేపీ బూత్ ఏజెంట్ల కోసం పట్టణంలోని సేవాసౌధలో బీఎల్ఏ 2 శిబిరంలో పాల్గొని మాట్లాడారు. గత ఎన్నికల్లో గ్యారెంటీ పథకాల ప్రచారంతో ప్రజలు మద్దతు ఇచ్చారన్నారు. అధికారంలోకి వచ్చాక అభివృద్ధిని విస్మరించారన్నారు. రానున్న రోజుల్లో జరిగే స్థానిక సంస్థల ఎన్నికల్లో ఓటర్లను చైతన్యం చేసేలా కార్యకర్తలు శ్రమించాలన్నారు. ప్రధాని నరేంద్రమోదీ ఆత్మనిర్భర్ పథకం ప్రతి ఇంటికీ చేరాలన్నారు. స్వదేశీ వస్తువుల వాడకంపై జాగృతి కల్పించాలన్నారు. సమావేశంలో బీజేపీ జిల్లా అధ్యక్షుడు సీకల్ రామచంద్రగౌడ, నరేశ్, చాతుర్య సురేంద్రగౌడ తదితరులు పాల్గొన్నారు.

గుంతల రోడ్లపై వినూత్న నిరసన



నిరసన తెలుపుతున్న కాంగ్రెస్ నాయకుడు మంజునాథ్ తదితరులు

మహదేవపుర, నవంబరు 9(ఆంధ్రజ్యోతి): నగరంలో అత్యధిక పన్నులు వసూలయ్యే నియోజకవర్గంగా పేరొందిన మహదేవపురలో ఇటీవల రోడ్లపై గుంతలు అధికమయ్యాయి. బీబీఎంపీ వెంటనే గుంతలు పూడ్చాలని డిమాండ్ చేశారు. ఆదివారం గుంతలకు పూజలు చేసి బూడిదగుమ్మడికాయతో దిష్టితీశారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ నాయకుడు కుప్పి మంజునాథ్ నేతృత్వంలో నిరసన తెలిపారు. ప్రభుత్వం నుంచి గ్రాంట్లు విడుదలైనా రోడ్లను బాగు చేయడంలో అధికారులు విఫలమయ్యారని ఆరోపించారు. గుంతల రోడ్లతో వాహనచోదకులు నిత్యం అవస్థలు ఎదుర్కొంటున్నారని విచారం వ్యక్తం చేశారు.

ఘనంగా కనకదాస జయంతి



కనకదాస విగ్రహం వద్ద మాజీ మంత్రి లింబావళి తదితరులు



కనకదాసు వేషధారణ

మహదేవపుర, నవంబరు 9(ఆంధ్రజ్యోతి): నియోజకవర్గంలోని బళగెరె రోడ్డులో కనకసేవ సమితి ఆధ్వర్యంలో కనకదాస జయంతి ఘనంగా జరిగింది. మాజీ మంత్రి అరవింద లింబావళి ముఖ్యులుగా పాల్గొని కనకదాస విగ్రహానికి పుష్పాంజలి ఘటించారు. లింబావళి మాట్లాడుతూ కనకదాసు కేవలం భక్తి సందేశం మాత్రమే కాదని, సమాజంలోని కుల వ్యవస్థ, మూఢ నమ్మకాలపై జాగృతి కల్పించారన్నారు. కీర్తనలు, కావ్యాల ద్వారా చైతన్యం చేశారన్నారు. ఆయన కేవలం ఒకవర్గానికే పరిమితం కాదన్నారు. మహనీయుల జయంతి కంటే వారి ఆదర్శాలు పాటించడం ద్వారా జీవితాలకు సార్థకత సాధ్యమన్నారు. ఈ సందర్భంగా అన్నదానం నిర్వహించారు. కార్యక్రమంలో బీజేపీ హోబళి అధ్యక్షుడు శ్రీధరరెడ్డి, కనకసేవా సమితి అధ్యక్షుడు శ్రీధర్, పదాధికారులు పాల్గొన్నారు.

కులవ్యవస్థపై పోరాటం

బాగేపల్లి: ఐదు దశాబ్దాల క్రితమే సమాజంలోని కులవ్యవస్థపై కనకదాసు ఎలుగెత్తి పోరాటం చేశారని పాఠశాల ముఖ్యులు నాగరత్నమ్మ పేర్కొన్నారు. తాలూకాలోని గూళూరు గ్రామంలోని నేహ విద్యాసంస్థలో కనకదాస జయంతిలో పాల్గొని మాట్లాడారు. కీర్తనలు, కావ్యాల ద్వారా కన్నడ సాహిత్యానికి ఎనలేని సేవలందించారన్నారు. సమాజంలోని మూఢనమ్మకాలను తొలగేందుకు కృషి చేశారన్నారు. పాఠశాలలో పిల్లల భక్త కనకదాస వేషధారణ అందరినీ ఆకట్టుకుంది.

అధికారం కంటే సేవలు శాశ్వతం



తిమ్మరాజును సత్కరిస్తున్న స్థానిక సంస్థల ప్రముఖులు

విజయపుర, నవంబరు 9(ఆంధ్రజ్యోతి): తమకు లభించిన అధికారం కంటే ఆ అవధిలో రైతులు, ప్రజలకు తాము అందించిన సేవలే శాశ్వతంగా ఉంటాని శిడ్లఘట్ట పట్టుగూళ్ల మార్కెట్ సహాయ డైరెక్టర్ తిమ్మరాజు పేర్కొన్నారు. జిల్లా పంచాయతీ శివమొగ్గ పట్టుగూళ్ల డిప్యూటీ డైరెక్టర్‌గా పదోన్నతి పొందిన నేపథ్యంలో పట్టణంలో ఆయన నివాసంలో సీనియర్ చాంబర్ ఇంటర్నేషనల్ విజయపుర విభాగం, జేసీఐ సంస్థ సంయుక్తంగా సత్కరించాయి. సన్మానం స్వీకరించి ఆయన మాట్లాడుతూ అధికారం, జీతం కంటే ప్రజలకు అందించిన సేవలే ప్రధానమన్నారు. ఈ సందర్భంగా స్థానిక ప్రముఖులు దిన్నూరు వెంకటేశ్, పట్టుగూళ్ల మార్కెట్ మాజీ సహాయక డైరెక్టర్ మునిరాజు తదితరులుపాల్గొన్నారు.

అపరిశుభ్రతకు నిలయం కరికెర

● పట్టించుకోని అధికారులు



రోడ్డుపై నిల్వ ఉన్న మురుగునీరు



అపరిశుభ్రంగా ఉన్న మురుగు కాలువలు

గుడిబండ, నవంబరు 9(ఆంధ్రజ్యోతి): మండలంలోని కరికెర పంచాయతీ గ్రామాలు అపరిశుభ్రతకు నిలయంగా మారుతున్నాయి. కరికెర పంచాయతీలో దాసరపల్లి, హిరేతుర్పి, హెచ్‌గొల్లహట్టి గ్రామాలున్నాయి. ఈ పంచాయతీ గ్రామాల్లో డ్రైనేజీలు, మురుగు కాలువలు చెత్తా, చెదారం పేరుకుపోయినా సంబంధిత అధికారులు వాటిని తొలగించడంలో విఫలమయ్యారని గ్రామస్థులు ఆరోపిస్తున్నారు. పంచాయతీ కార్యదర్శులు గ్రామాల్లో పర్యటించిన దాఖలాలు లేవని ప్రజలు అంటున్నారు. గ్రామాల్లో చెత్తాచెదారం, మురుగు కాలువలో పేరుకుపోవడంతో ఈగలు దోమలు వ్యాప్తి చెంది ప్రజలు రోగాల బారిన పడుతున్నారని ప్రజలు అంటున్నారు. పంచాయతీ గ్రామాల్లో చెత్తాచెదారం ఎందుకు తొలగించడంలేదని పలువురు ప్రశ్నిస్తున్నారు. ప్రభుత్వం స్వర్ణాంధ్ర స్వచ్ఛాంధ్ర కార్యక్రమం కరికెర పంచాయతీ గ్రామాల్లో అమలు కావడంలేదని ప్రజలు పేర్కొంటున్నారు. సంబంధితశాఖ అధికారులు స్పందించి గ్రామాల్లో పేరుకుపోయిన చెత్తాచెదారాన్ని తొలగించడంతోపాటు డ్రైనేజీలు శుభ్రంచేయాలని గ్రామస్థులు కోరుతున్నారు.

చర్యలు చేపడతాం

కరికెర పంచాయతీ గ్రామాల్లో నెలకొన్న అపరిశుభ్రతను తొలగించి ఈగలు, దోమలు వ్యాప్తి చెందకుండా బ్లీచింగ్ చల్లి గ్రామాలను శుభ్రంగా ఉండేందుకు చర్యలు చేపడతాం. పంచాయతీ గ్రామాలు సందర్శించి నెలకొన్న సమస్యలను పరిష్కరించేందుకు కృషిచేస్తాం.

-నాగరాజునాయక్, డిప్యూటీ ఎంపీడీఓ

ఆక్రమణల తొలగింపుతో సరి

మురుగుకాలువకు మరమ్మతులేవీ..?



మరమ్మతులకు నోచుకోని మురుగు కాలువ

సోమందేపల్లి, నవంబరు 9(ఆంధ్రజ్యోతి): మండలకేంద్రంలోని డీఎల్ రోడ్డులో రెండు నెలల క్రితం మురుగు కాలువను ఆక్రమించి చేపట్టిన నిర్మాణాలను తొలగించారు. అప్పటి నుంచి డ్రైనేజీ మరమ్మతులు చేపట్టకపోవడంతో ఇబ్బందులు పడుతున్నట్లు స్థానికులు తెలిపారు. మురుగునీటి ద్వారా దుర్గంధం వెదజల్లుతోందని అంటున్నారు. దోమలవ్యాప్తి అధికమయ్యిందని, రోగాలు ప్రబలుతున్నాయని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. 12 అడుగుల రోడ్డులో ఉన్న మురుగుకాలువ తెరిచి ఉండటంవల్ల తరచూ ప్రమాదాలు జరుగుతున్నాయన్నారు. కొందరు మురుగు కాలువపై బాత్‌రూంలు, ప్రహరీ నిర్మాణాలు చేపట్టారు. అప్పట్లో ఎంపీడీఓ వెంకటలక్ష్మీ ఆదేశాల మేరకు పంచాయతీ కార్యదర్శి రామాంజినేయులు గృహయజమానులకు నోటీసులు అందించారు. స్వచ్ఛందంగా నిర్మాణాలు తొలగించుకునేందుకు గడువు ఇచ్చారు. ఈ దిశలో స్పందనరాకపోవడంతో ఎక్స్‌కావేటర్‌తో ఆక్రమణలను అధికారులు తొలగించారు. అంతేకాకుండా పట్టణంలో అన్ని ప్రాంతాల్లో మురుగు కాలువలు ఆక్రమించివుంటే దశలవారీగా తొలగిస్తామని అప్పట్లో పేర్కొన్నారు. తరువాత ఏమైందో ఏమోకానీ ఎలాంటి చర్యలు చేపట్టలేదు. అదేవిధంగా ఆక్రమణలు తొలగించినచోట మరమ్మతులు సైతం చేపట్టలేదు. ఇప్పటికైనా అధికారులు స్పందించి మురుగుకాలువలపై స్లాబ్‌లు ఏర్పాటు చేసే దిశగా చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు. దీనిపై ఎంపీడీఓ వెంకటలక్ష్మీని వివరణ కోరగా పరిశీలించి చర్యలు చేపడతామన్నారు.

సమస్యల పరిష్కారానికి ఉద్యమాలు అవసరం

ఏఐఎంఎస్ఎస్ రాష్ట్ర అధ్యక్షురాలు సుమలత

పరిగి, నవంబరు 9(ఆంధ్రజ్యోతి): మహిళల సమస్యలు పరిష్కరించేందుకు దేశవ్యాప్తంగా ఉద్యమాలు అవసరమని ఏఐఎంఎస్ఎస్ రాష్ట్ర అధ్యక్షురాలు సుమలత పేర్కొన్నారు. పరిగి మండలంలోని ఐకాన్ కళాశాలలో పరిగి మండల ఏఐఎంఎస్ఎస్ సదస్సు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి హాజరైన సుమలత మాట్లాడుతూ మహిళలపై అత్యాచారాలు, దాడులు అధికమయ్యాయన్నారు. దీంతో ఉద్యమాలు చేయాల్సిన అవసరం ఆసన్నమైందన్నారు. మహిళలపై దాడులు, అత్యాచారాలు, అశ్లీల సినిమాలు నిషేధించాలన్నారు. వీటిపై పోరాటం చేయాలంటే బలమైన ప్రజా ఉద్యమం అవసరమన్నారు.

పురంలో గురునానక్ జయంతి

హిందూపురం, నవంబరు 9(ఆంధ్రజ్యోతి): హిందూపురంలో గురునానక్ జయంతిని ఆదివారం ఘనంగా నిర్వహించారు. కులమతాలకు అతీతంగా ఆయన చిత్రపటానికి పూలమాలలువేశారు. పండ్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ రమేష్, వైస్ చైర్మన్ జబీవుల్లా, శివశంకర్, ఇందాద్ పాల్గొన్నారు.

ఘనంగా ఆంజనేయస్వామి రథోత్సవం



రథాన్ని లాగుతున్న భక్తులు

రొళ్ల, నవంబరు 9(ఆంధ్రజ్యోతి): మండలంలోని కొడగార్లగుట్ట గ్రామంలో వెలసిన ఆంజనేయస్వామి రథోత్సవం ఆదివారం ఘనంగా జరిగింది. ఈ సందర్భంగా ఉదయం నుంచి స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం తీర్థప్రసాదాల వినియోగం చేశారు. అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు. రథోత్సవంలో సింగిల్‌విండో అధ్యక్షుడు దాసిరెడ్డి, వక్కళిగ సాధికర సమితి అధ్యక్షుడు పాండురంగప్ప, రామక్రిష్ణ, మండల కన్వీనర్ ఈరన్న, యోగానంద్ తదితరులు పాల్గొన్నారు.

సంబరంగా కన్నడ రాజ్యోత్సవం



కన్నడ రాజ్యోత్సవంలో ఉత్సాహంగా స్థానికులు

విజయపుర, నవంబరు 9(ఆంధ్రజ్యోతి): విజయపుర పట్టణంలోని సంగమేశ్వర థియేటర్ వద్ద జెనక గెళెయర బళగ ఆధ్వర్యంలో కన్నడ రాజ్యోత్సవాన్ని అర్థవంతంగా ఆచరించారు. కన్నడమాత భువనేశ్వరిదేవికి పూలమాలలు సమర్పించి కన్నడ పతాకాన్ని ఎగురవేశారు. అందరూ కన్నడ కండువాలను ధరించారు. అనంతరం అన్నసంతర్పణ నిర్వహించారు. కార్యక్రమంలో రమేశ్, హరీశ్, ఆర్‌సీ మంజునాథ్, సదాశివ్ మునిరాజు తదితరులు పాల్గొన్నారు. కాగా పట్టణ వ్యాప్తంగా వివిధ సంఘాల ఆధ్వర్యంలో కన్నడ రాజ్యోత్సవ కార్యక్రమాలు ఉత్సాహంగా సాగుతున్నాయి.

నేటి నుంచి నేషనల్ కళాశాలలో అర్ణవ

బెంగళూరు, నవంబరు 9(ఆంధ్రజ్యోతి): నేషనల్ కళాశాల ఆధ్వర్యంలో పీయూ, డిగ్రీ విద్యార్థులకు రాష్ట్రస్థాయి అంతర్ కళాశాలల సాంస్కృతిక సినర్జియా ఉత్సవం అర్ణవ నిర్వహిస్తున్నారు. ఎన్‌సీజే క్యాంపస్‌లో రెండు రోజులపాటు కార్యక్రమాలు జరగనున్నాయి. విద్యార్థులు తమ వైవిధ్యమైన ప్రతిభను ప్రదర్శించేందుకు ఓ వేదిక సిద్ధం చేశారు. సాంస్కృతిక, సాంకేతిక విభాగాలలో ప్రదర్శనలు ఉంటాయని ప్రకటనలో పేర్కొన్నారు.

నేటి నుంచి నెట్‌వర్క్ వరల్డ్ ఫోరం సదస్సు

బెంగళూరు, నవంబరు 9(ఆంధ్రజ్యోతి): ఫ్యూచర్ నెట్‌వర్క్ వరల్డ్ ఫోరం సదస్సు సోమవారం నుంచి జరగనుంది. వైట్‌ఫీల్డ్‌లోని ఓ హోటల్‌లో మూడు రోజులపాటు సదస్సు జరగనున్నట్టు నిర్వాహకులు తెలిపారు. ఇంటర్నెట్‌కు అనుబంధమైన విండ్‌సర్ఫ్, నోకియా బెల్ ల్యాబ్స్ పీటర్ వెటర్ నగరంలో ఐఈఈఈ పేరిట సదస్సు నిర్వహిస్తోంది. భవిష్యత్తుకోసం 6జీ అనే అంశంపైనా చర్చాగోష్ఠి జరగనుంది. 70మంది ఎక్స్‌పర్ట్ స్పీకర్స్ పాల్గొంటున్నారు. గూగుల్ వైస్ ప్రెసిడెంట్ డాక్టర్ విండ్‌సర్ఫ్, కేంద్రప్రభుత్వ సైన్స్ అండ్ టెక్నాలజీ కార్యదర్శి అభయ్‌కరిందకర్, నోకియాబెల్‌ల్యాబ్స్ ప్రెసిడెంట్ పీటర్ వెటర్ సహా ప్రముఖులు పాల్గొననున్నారు.

రిట్రోఫిట్ రంగంలోకి ఎక్స్‌పొనెంట్ ఎనర్జీ

బెంగళూరు, నవంబరు 9 (ఆంధ్రజ్యోతి): బెంగళూరుకు చెందిన ఎనర్జీటెక్ కంపెనీ ఎక్స్‌పొనెంట్ ఎనర్జీ సంస్థ రిట్రోఫిట్ రంగంలోకి అడుగుపెట్టింది. ఆదివారం జయనగర్‌లో జరిగిన కార్యక్రమంలో ఎక్స్‌పొనెంట్ ఎనర్జీ కోఫౌండర్ సీఈఓ అరుణ్ వినాయక్ మాట్లాడుతూ ఎనర్జీ కంపెనీ దేశవ్యాప్తంగా ఈవీ అనుసంధానం కోసం పనిచేయదలిచామన్నారు. 15 నిమిషాల చార్జింగ్ టెక్నాలజీని ఉపయోగించడం ద్వారా ఉత్తమ పరికరాలతో కొత్తగా వాహనాలు కొనుగోలు చేసేవారికి సేవలందిస్తామన్నారు. పాత ఆటోలను సరికొత్తగా అప్‌గ్రేడ్ చేసే వీలుందన్నారు. రిట్రోఫిట్ ఎంపిక వేలాదిమందికి అనుకూలం కానుందన్నారు. కేవలం 4-5 సెకన్లలోనే వేగం పుంజుకోనుందని, 140 కిలోమీటర్ల దాకా ట్రూరేంజ్ ఇవ్వనుందన్నారు. త్రీవీలర్ విభాగంలో ఇంధన మార్పు రిట్రోఫిట్ ద్వారానే జరిగిందన్నారు. దేశవ్యాప్తంగా భాగస్వామ్యులతో కలసి పనిచేయదలిచామన్నారు. ఎక్స్‌పొనెంట్ ఎనర్జీ బిజినెస్ హెడ్ ఆయుష్ భార్గవ్‌తోపాటు పలువురు పాల్గొన్నారు.

బీజేపీ నియోజకవర్గ ప్రధాన కార్యదర్శిగా మురళీకృష్ణ



మురళికృష్ణ

దొమ్మసంద్ర, నవంబరు 9(ఆంధ్రజ్యోతి): ఆనేకల్ శాసనసభ నియోజకవర్గ బీజేపీ ప్రధాన కార్యదర్శిగా వీ మురళీకృష్ణ ఎంపికయ్యారు. సర్జాపుర సమీపంలోని ము గళూరు పంచాయతీ పరిధిలోని మహల్ చౌడెనహళ్ళికి చెందిన మురళికృష్ణకు పార్టీలో చక్కటి అవకాశం లభించింది. ఈమేరకు ఆదివారం ఆయన మీడియాతో మాట్లాడుతూ నియోజకవర్గ బీజేపీ అధ్యక్షుడు అశోక్‌రెడ్డి నియామకపత్రాన్ని అందచేశారన్నారు. తనకు అవకాశం కల్పించిన పార్టీ నాయకులకు కృతజ్ఞతలు తెలిపారు. పార్టీ బలోపేతానికి తనవంతు కృషి చేస్తానన్నారు.

యోగా గురు నిరంజన్‌మూర్తి చార్జ్‌షీట్‌లో మరిన్ని దురాగతాలు

బెంగళూరు, నవంబరు 9(ఆంధ్రజ్యోతి): యోగా నేర్చుకునేందుకు వెళ్లిన ఓ విద్యార్థినికి అవకాశాలు కల్పిస్తామంటూ అత్యాచారానికి పాల్పడిన యోగా గురు నిరంజనమూర్తిపై పోక్సో చట్టం కింద కేసు నమోదైన సంగతి తెలిసిందే. విచారణ జరిపిన ఆర్ఆర్‌నగర్ పోలీసులు చార్జ్‌షీట్ నమోదులో మరిన్ని దురాగతాలు వెలుగులోకి వచ్చాయి. కేవలం విద్యార్థినిపై మాత్రమే దారుణానికి పాల్పడ్డారని పోలీసులు భావించారు. అందుకు అనుగుణంగా పోక్సో కేసు నమోదు చేశారు. కేవలం ఓ విద్యార్థిని మాత్రమే కాదని... యోగా నేర్చుకునేందుకు వచ్చిన పలువురు మహిళలను వివిధ రీతుల్లో వేధించి బలాత్కారాలకు పాల్పడిన కొన్ని వీడియోలు, ఫోటోలను పోలీసులు సేకరించారు. ఫోరెన్సిక్ ల్యాబ్ నుంచి డీఎన్ఏ నివేదిక రావాల్సి ఉంది. పలువురు మహిళలతో లైంగిక సంబంధాలు ఉన్నట్టు గుర్తించారు. విద్యార్థిని మినహా మిగిలినవారు ఎవరూ పోలీస్‌స్టేషన్‌ను ఆశ్రయించలేదు. అయితే పోలీసులు సేకరించిన ఆధారాలకు అనుగుణంగా మహిళల చెంతకు వెళ్లి ఆరాతీసినా బహిరంగం అవుతామని కొందరు వెనుకంజ వేసినట్టు తెలుస్తోంది. కానీ సేకరించిన ఆధారాలు యోగాగురుకు వ్యతిరేకంగా ఉన్నట్టు తెలిసింది.